# గన్నరు గురుమూర్తి

నేను గూబగోపాయి ఎట్టా అయినానో ఈవరకే యారో సెప్పారుగా! షరే!

గురుమూర్తిగాడు గన్నరెట్టా అయినాడో సెప్తాసూడు! గన్నరంటే గురుమూర్తే గన్నరురా! అసలాడు గన్నర్లలో పేరలా! అదృష్టమంతుండు. అందుకనే అంతగొప్ప పేరు సంపాయించాడు.

గౌహటీలో కాంపు వేసివున్నాం. సిల్లాంగు ఎళ్ళేదారిలో ఓ తాళ్ళ గుంపుంటే అక్కడేశాం డేరాలు. గౌహటీ అంటే మనూళ్ళమాదిరి గాదు.

బమ్మపుత్ర ఒడ్డునుంది. పెద్దపెద్ద శాపలు ఎన్నైనా ఉన్నై. బియ్యం కడుగు సారాయి సిలాంగునుంచి వత్తుంది. అక్కడుంటే ఎన్ని విద్దెలైనా వత్తాయి. ఆ విద్దెల్లోపడి పెల్లాన్నీ నలుగురు బిడ్డల్నూ మరిసిపోతాం.

మామారణంగా కాలం గడపొచ్చు. అందులో మేం మిలిటరోళ్ళం ఉన్నాం అంటే తిరణాల్లే. ఇదంతా మాబాగా తెలుసు గురుమూర్తిగాడికి.

ఇయ్యాల ఆడేదో కొంచెం అనుమానంగా సూస్తూ నుంచున్నాడు. ఎక్కడ నుంచున్నాడూ? బియ్యంకడుగు సారాయి, శాపలకూరా, ఆర్మీ వియం పాటా ఉండే ఓ సిన్న ఓటలుగేటు దగ్గిర నుంచున్నాడు. ఆ యెండు బెండకాయలంటి ఆ వచ్చేపోయే మొదరట్టం జనాన్ని చూత్తూంటే అనుమానం యారికైనా వత్తుంది.

ఇంతలో వచ్చింది-సైకిలుగూడా ఎక్కివచ్చింది—ఖాసియానీ! సిటికెనెయేలంత ఎత్తుంది సిరిసిరి మువ్వల్లే. దాని టాసాకొయ్యా ఏం తొడిగిందో తెలుసా! తెల్లనిక్కరు — తేనెరంగు చొక్కా! టమాటారంగు పెదిమలమద్దె చిగెరెట్టు! అదేందో ఓరకం పువ్వు తలెంట్రుకల్లో! ఓటలు గేటుదగ్గిర సైకిలు పెట్టింది.

"ఆ నువ్విక్కడికి కొత్తోడల్లే ఉన్నావే" అంటున్నట్టుగా కళ్ళెట్టి చూత్తూ లోపలికి పోయింది.

అదొక పద్ధతివారీ మనిసల్లే లేదు. గౌహటీలో మామూలుగా కనబడే మనిసల్లేనూ లేదు. సీటును మించిన నాగరికత ఉన్నట్టుంది. నాగరికతను మించిన నెరజాణత్వం ఉన్నట్టుంది.

"ఓహో" అన్నాడు గురుమూర్తిగాడు—బార్బుడు వైరులాంటి కనుబొమలు ఎగరేత్తూ. పెదిమలు రెండూ సిప్పల్లే బిగించాడు—ఎన్నెన్ని ఊళ్ళల్లో తుబుకుమని ఉమ్మేశాడో పొగాకేసుకుని ఆ పెదిమలతో!

"లోపలికిపోయి కొత్త డ్రింకేసుకుందాం, పదా!" అన్నాడు.

లోపలికిపోయాం ఇద్దరం సెరుగ్గడల్లే ఊగుకుంటూ.

ఇరవై ముప్పై ఖాళీసీట్లున్నెయ్యన్న మాటలేకుండా గాలోనకు కొట్టుకుపోయి పడ్డోడిల్లే దాని కుర్సీ పక్క కుర్సీలో సతికిలడ్డాడు గురుమూర్తిగాడు.

"కులాసాగా వున్నావా కుర్రదానా?" అన్నాడు. పలకరించడంలో తానో మొనగాడనుకుంటాడు ఆడు.

అదీ సరే! ఈడికోసమే కూసున్నదానల్లే యెంటనే నవ్వింది.

"ఊయి! హిందూత్తానోడవా?" అంది వచ్చీరాని హిందూ

"కాదే! తెలుగోడ్నే" అన్నాడు. ఆడికి హిందూత్తాని సరింగా రాదు.

"జపానోళ్ళ నెవరైనా పట్టుకున్నావా?" అని అడిగింది.

ఆడిమొగం ఆడుసూసిన జపానోళ్ళల్లా ఇద్దరు ఖైదీలను.

"సూశాను, రంగూను దగ్గిర రెండు ఇమానాలు, మూడు మరపిరంగులూ, అయిదుగురు జపానోళ్ళనూ. నేనూ యీడూ బయ్యంలేకుండా పట్టుకున్నాం" అన్నాడు.

"ఇంతేనా?" అంది.

ఆడి గుండెలు గుత్తికొండబిలంలో పడ్డట్లయింది.

"అది మొదటిసారి" అన్నాడు.

నేను పైదూలాలు సూత్తున్నా.

"రెండోసారేమయింది?" అని అడిగింది.

"సరేగాని డ్రింకులు తెప్పించనా" అన్నాడు.

కిందికి సూశాను నేను.

డ్రింకులొచ్చాయి.

దానిపేరు మేరీ—సిల్లాంగు సరుకు.

మళ్ళీ డ్రింకులొచ్చాయి.

మళ్ళీ డ్రింకులు.

మళ్ళీ డ్రింకులు.

"ఇక్కడికి మూడుమైళ్ళ దూరంలో ఆళ్ళ ఇళ్ళున్నై. అది అదో రకం డాన్సులుంటై. అందులో అడివిడాన్సులు బాగుంటై. పోదామా" ప్రశ్న.

మళ్ళీ డ్రింకులొచ్చాయి.

మూడువేల ఆరువందల నలభై మూడోసారి మళ్ళీ మోహం అంటూ ఆడి జీవితంలో కొచ్చింది.

నిజానికి యుద్ధం కొత్త రోజుల్లోనూ అంతకుపూర్వమూ (అని ఇంటాను) ఆ రోడ్లమీద ఆ అడువుల్లోనూ మజాలకోసం యెతికితే ఏముంటై? అవ్వేందో బైనాక్యులర్లంట ఆటితో సూత్తూ, పోటోలు తీత్తూ, అడివి మనుషులను వర్ణిత్తూ, పుత్తకాలల్లో రాసుకునే మిసనరీ వోళ్లతప్ప!

ఎట్టా అయితే యేంలే. ఆ అడివినాట్యం సూద్దామనుకుంటే సూద్దామనుకున్నాం. మేం గూడా బైసికిళ్ళరు వుచ్చుకున్నాం. పోయాం.

ఎంత దూరమైనా యెళ్ళటానికి తయ్యారుగా ఉన్నాడు గురుమూర్తి గాడు.

ఆడు పుచ్చుకున్న బియ్యపు సారాయికి అంతులేదు—చాలా సౌక.

అది తలలో ఒక్కొక్క తన్ను తంతుంటే ఇంద్రలోకం కనబడాలి. తాగిన అయిదురోజులదాకా అయిదంతత్తుల మేడమీదున్నట్టే ఉంటుంది.

ఆడి జేబులోగూడా ఒకటి పట్టుకొచ్చాడు. మద్దె మద్దె ఎగరేత్తున్నాడు.

పోయాం పోయాం ఎక్కడికెళ్ళామో ఎంతదూరం ఎళ్ళామో! సివరికి సేరాం. అక్కడ నాలుగు గుడిసెలున్నై. ఓ పెంకుటిల్లుంది. ఓ యాపసెట్టుకింద మొగాళ్ళూ ఆడాళ్ళూ కలిసి తెల్లోళ్ళల్లేనే డాన్సు సేత్తున్నారు. సూట్టానికి లంబాడీలల్లే ఉన్నారు. లంబాడీలు కాదు.

ఓ మద్దెలమీద ఒక డాయిత్తున్నాడు. ఓ బుర్రమీదొక డూత్తున్నాడు.

కాసేపు కూకున్నాం. అదేందో తెచ్చిపెట్టారు. కప్పల్తో పేసిందేమో అని నేనేం ముట్టుకోలేదు. డాన్సు చేత్తున్నాను. చూత్తూ చేతికొచ్చింది తింటూ కూకున్నాడు గురుమూర్తిగాడు.

ఆ పెంకుటింటోకి పోయింది రాంగానే మేరీ. కాస్సేపటికి బైటికొచ్చింది. దాంతోగూడా ఓ లావాటి బుర్రమీసాలోడు ఓ జాడీ పట్టుకునొచ్చాడు. ఆళ్ళను సూళ్లేదు గురుమూర్తిగాడు.

మాకొంచెం దూరంగా బాటిలు ముందేసుకుని ఓ పిల్లతో సరసాలాడుతూ ఇంకో ఇద్దరు సిపాయిలు కూకున్నారు. ఆళ్ళను సూళ్లా గురుమూర్తిగాడు.

ఆడి దుష్టి ఓ సిన్న నాగా పిల్లమీద పడ్డది.అది వొళ్ళంతా ఊపుతూ డాన్సు చేత్తున్నది. దాని డాన్సుసూసి తాచుపాంగూడా సిగ్గడాలి. అది దగ్గరకు రాంగానే దాన్ని మద్దె మద్దె ముట్టుకుంటూ దాని యెనకాలే యాడు

గూడా ఆడటం ఆరంభించాడు. ఎక్కడో యీదినాటకంలో నేర్చుకున్నాడు గామోసు.

ఇంతలో మేరీ, దాంతోగూడా ఆ బుర్రమీసాలోడూ వచ్చారు. దాన్ని సూడంగానే గురుమూర్తిగాడికి సగం గుండెలు జారి సూట్టం మొదలెట్టాడు.

ఆ బుర్రమీసాలోడు ఆడిదగ్గరకుపోయి ఆ జాడీలోంచి వంచి పూర్తిగా ఓ గలాసులోకిచ్చి "తాగు ఇది అసలు సరుకు" అన్నాడు.

గలాసు తీసుకుని గబ్బిళాయల్లే సూత్తూరుకున్నాడు గురుమూర్తిగాడు.

"నిజంగా అసలైన సరుకే, లేకపోతే మా ఆయనచేత నీ కిప్పిత్తానా?" అంది మేరీ.

"మీ ఆయనా?" అన్నాడు గురుమూర్తిగాడు గురుగింజలంత సిన్న కళ్ళు సేసుకుని.

మొగం నావంక తిప్పాడు. గలాసు చూపించాడు. "ఆడాళ్ళంతా వకటే మోసం చేత్తారు. ఈ సరుకటువంటిది గాదురా. దీన్నిమాత్రం ఇడిసెట్టనురా" అన్నాడు.

మొగం అటుతిప్పాడు. గలాసు పెదిమలమీదెట్టి ఎదురుగా సూశాడు. రంబకోసం తపస్సు సేశేవారికి కనబడే దేవతల్లే ఎదురుగా నవ్వుతూ నుంచుంది ఇందాకటి నాగాపిల్ల.

"ఛమించరా ఇప్పుడేవత్తాను" అని దాన్ని తీసుకెళ్ళాడు.

"ఈడెవడో గన్నరురా" అనుకుంటున్నారు అవతలిద్దరు సిపాయిలూ!